వుదయం



# శ్రీ శివ ముత్యాలమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి సమిష్టి కృషి

### ఆలయ వైభవ పునరుద్ధరణకు కార్యాచరణ- భక్తుల సహకారంతో మహోన్నతంగా తీర్చిదిద్దుతాం : కమిటీ అధ్యక్షులు ఉంగరాల వెంకట్రావు



భద్రాచలం, జూన్ 8 (వుదయం ప్రతినిధి): భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసి రోడ్డులో కొలువై ఉన్న శ్రీ శ్రీ శివ ముత్యాలమ్మ తల్లి ఆలయాన్ని ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా మరింత అభివృద్ధి చేసి భక్తులకు ఆదర్శవంతమైన పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు కమిటీ అధ్యక్షులు శ్రీ ఉంగరాల వెంకట్రావు తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం కమిటీ సభ్యులు, భక్తులు, దాతలు, స్థానిక ప్రజల సహకారంతో ముందుకు సాగుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముత్యాలమ్మ తల్లి అనుగ్రహంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, ఆలయ నిర్మాణ విస్తరణ, సుందరీకరణ, మౌలిక వసతుల కల్పన, భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఆలయ నిర్మాణ పనులు శాస్త్రోక్తంగా ఉండేలా స్థపతులతో సంప్రదింపులు జరుపుతున్నామని, ఆగమశాస్త్ర నిపుణుల సూచనల మేరకు పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రసిద్ధ దేవాలయాల నిర్మాణ శైలులను పరిశీలిస్తూ, వాటి ప్రత్యేకతలను అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. సంప్రదాయబద్ధతకు భంగం కలగకుండా ఆధునిక సౌకర్యాలను కల్పించడం ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగించేలా ఆలయాన్ని తీర్చిదిద్దాలని సంకల్పించామని వెల్లడించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన ప్రాంగణం, ప్రత్యేక మండపాలు, పూజా కార్యక్రమాల నిర్వహణకు అనువైన వేదికలు, త్రాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాలంకరణ, పారిశుధ్య సదుపాయాలు, విశ్రాంతి ప్రాంతాలు వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఆలయంలో ప్రత్యేక ఉత్సవాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సాంస్కృతిక వేడుకలు నిర్వహించే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ముత్యాలమ్మ తల్లి ఆలయం కేవలం పూజా స్థలం మాత్రమే కాకుండా ప్రజల విశ్వాసానికి, సంప్రదాయాలకు, సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోందని ఉంగరాల వెంకట్రావు అన్నారు. ఆలయ అభివృద్ధి ద్వారా యువతలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందడంతో పాటు సనాతన ధర్మ పరిరక్షణకు కూడా తోడ్పాటుగా నిలుస్తుందని చెప్పారు. ఆలయ అభివృద్ధి కోసం కమిటీ ఇప్పటికే పలు సూచనలు స్వీకరిస్తోందని, స్థానిక ప్రజలు, పెద్దలు, భక్తులు తమ విలువైన సలహాలు అందించాలని కోరారు. ఆలయ నిర్మాణం పూర్తయిన తర్వాత భద్రాచలం పట్టణంలో మరో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా ముత్యాలమ్మ తల్లి ఆలయం గుర్తింపు పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందించడం, సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఆలయ అభివృద్ధికి చేయూతనివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరి సహకారంతో ఆలయాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దడమే కమిటీ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పద్మనాభుని రవికుమార్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం రూపొందించిన ప్రణాళికలను వివరించారు. కమిటీ సభ్యులందరూ సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో 4వ వార్డు సభ్యులు బండారు శరత్ బాబు, కోశాధికారి బోళ్ళ వెంకట్రావు, కమిటీ ప్రధాన బాధ్యులు మారెడ్డి శివాజీ, పసుపులేటి వెంకటేష్, సీహెచ్ రామలింగేశ్వరరావు, పసుపులేటి వీవీ సత్యనారాయణ, పిరింట్ల శ్రీకాంత్ రెడ్డి, జినుగు నాగేంద్రరావు, జి. రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి కావాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులందరి సహకారంతో శ్రీ శివ ముత్యాలమ్మ తల్లి ఆలయాన్ని మరింత వైభవోపేతంగా తీర్చిదిద్ది భవిష్యత్ తరాలకు ఆధ్యాత్మిక వారసత్వంగా అందించాలని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

# వి.హెచ్.ఎస్.ఎన్.సి సమావేశం నిర్వహణ

### ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం సురక్షితం, హెచ్.పీ.వీ వ్యాక్సిన్ పై అపోహ వద్దు - సర్పంచ్ పగడాల



దమ్మపేట(జూన్ 08): (వుదయం ప్రతినిధి ): దమ్మపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రతీ నెల నిర్వహించే గ్రామ ఆరోగ్య, పారిశుధ్య మరియు పోషకాహార కమిటీ సమావేశంను సోమవారం సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, కార్యదర్శి బండి అనంత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. త్రాగు నీరు, పారిశుధ్యం, గర్భిణీలు, బాలింతలు మరియు పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, సీజనల్ వ్యాధులు నివారణ చర్యలు, హెచ్.పి.వి వ్యాక్సిన్, క్షయ వ్యాధి, కాన్పు కాన్పు మధ్య గ్యాప్, అంగన్‌వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా అందుతున్న సేవల పనితీరు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆశాలు మాట్లాడుతూ హెచ్.పీ.వీ వైరస్ వ్యాక్సిన్ పై అపోహలు పెట్టుకోవద్దని 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాల లోపు బాలికలకు ఈ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని ప్రభుత్వం ముందస్తు నివారణ చర్యగా మన పిల్లల భవిష్యత్తు కోసం అందిస్తుంది అన్నారు. హెచ్పీవీ వ్యాక్సిన్ మహిళల్లో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ను నివారిస్తుందని తెలిపారు. సుఖ ప్రసవం కోసం స్థానిక పీ.హెచ్.సీ లో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించుకోవాలి అన్నారు.

మొదటి కాన్పు అయ్యి రెండో బిడ్డ కాన్పు గ్యాప్ మూడు సంవత్సరాలు ఉండాలని అన్నారు. తక్కువ సమయంలో రెండోసారి గర్భం దాల్చితే అది తల్లి, బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది అన్నారు. కాపర్ టి, లూప్ అని పిలిచే గర్భ నిరోధకం అనేది పిల్స్ వాడడం కంటే లూప్ వేయించు కోవడమే చాలా మంచిది అని తెలియజేశారు. క్షయ వ్యాధి అనేది గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధి. టీబీ అనేది రోగనిరోధక శక్తి చాలా తక్కువగా ఉన్నవారికి. హెచ్.ఐ.వి / ఎయిడ్స్, షుగర్ ఉన్నవారికి, పోషకాహార లోపం ఉన్నవారికి. టీబీ రోగులతో ఎక్కువ కాలం సన్నిహితంగా గడిపే వారికి ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి కావున రెండు వారాలు కన్నా ఎక్కువ దగ్గే వారు టెస్ట్ చేయించుకొని జాగ్రత్త పడాలి అన్నారు.

వర్షాకాలం దృష్ట్యా దోమలు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

డెంగ్యూ, మలేరియా లాంటి సీజనల్ వ్యాధులు రాకుండా దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా వస్తది కనుక పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల ఉత్పత్తిని అరికట్టవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, పసుమర్తి కుసుమాంబ, అంగన్వాడీ టీచర్లు గోళ్ళ సీతారావమ్మ, బి. రమణ, మంగాదేవి, అలివేలు, విజయ, ,విజయలక్ష్మి, ఆశాలు రజని, వరలక్ష్మి, సంధ్య, సమ్మక్క రమాదేవి, నారాయణమ్మ, గ్రామస్తులు దాసరోజు రామబ్రహ్మం, వనమాల సూరిబాబు, శంకరవర అయ్యప్ప, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# జన విజ్ఞాన వేదిక పనితీరుపై కలెక్టర్ ప్రశంసలు



నల్గొండ, జూన్ 08 (వుదయం ప్రతినిధి) : ఎండ తీవ్రతలో ఉపాధి హామీ కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గత 40 రోజులుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ ప్రశంసించారు. సోమవారం జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రతినిధులు కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను స్వచ్ఛందంగా చేపట్టడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో, బాలికా శిశు సంక్షేమ శాఖ సహకారంతో రూపొందించిన అవగాహన పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రతినిధులు ప్రొఫెసర్ బి.ఎన్. రెడ్డి, ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఎన్. వెంకటరమణారెడ్డి సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం, మూఢనమ్మకాల నిర్మూలన, సైన్స్ అవగాహన కార్యక్రమాల నిర్వహణలో జన విజ్ఞాన వేదిక కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన తరగతులు నిర్వహించడం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల్లో నెలకొన్న మూఢవిశ్వాసాలపై చైతన్య సదస్సులు ఏర్పాటు చేయడం, ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సైన్స్ సంబరాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలను ప్రతి ఏటా చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు బి.ఎన్. రెడ్డి, కోయ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఎన్. వెంకటరమణారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు వద్దిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కోలా శ్రీనివాస్, మహిళా సమత విభాగం రాష్ట్ర కన్వీనర్ దగ్గుపాటి విమల, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు గుత్తికొండ సుదర్శన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చేపూరి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ వార్తను పత్రికా ప్రచురణకు అనువుగా సంక్షిప్త వార్తా శైలిలో రూపొందించాం.

# జూలై చివరి నాటికి మిర్యాలగూడలో నక్ష సర్వే పూర్తి

### కలెక్టర్ బి. చంద్రశేఖర్ వెల్లడి

నల్గొండ, జూన్ 8: మిర్యాలగూడ మున్సిపాలిటీలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన "నక్ష సర్వే" కార్యక్రమాన్ని జూలై చివరి నాటికి పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నక్ష సర్వేకు పైలట్ పథకం కింద ఎంపికైన మున్సిపాలిటీలలో సర్వే పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లాలో చేపడుతున్న సర్వే వివరాలను కలెక్టర్ వెల్లడించారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఇండ్లు, ఖాళీ స్థలాలు, భవనాలకు సంబంధించిన సర్వే కోసం 32 వార్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో 356 బ్లాకులు ఉండగా, వాటిలో 43 వ్యవసాయ బ్లాకులు, 313 భవనాల బ్లాకులు ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం 25 వేల ఆస్తులను గుర్తించగా, ఇప్పటివరకు 9,375 ఆస్తులకు సంబంధించిన సర్వే పూర్తి చేసి 37 శాతం పురోగతి సాధించినట్లు తెలిపారు. ఇప్పటికే 6 వార్డుల్లో సర్వే పూర్తయిందని, మరో 6 వార్డుల్లో పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. సర్వే నిర్వహణ కోసం 5 ప్రత్యేక బృందాలతో పాటు 5 లైసెన్స్‌డ్ సర్వేయర్ బృందాలను నియమించినట్లు వెల్లడించారు. ఇండ్లు, ఖాళీ స్థలాలు, వ్యవసాయ భూములకు సంబంధించిన మ్యాపింగ్ కోసం మొత్తం 14 బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. జూలై చివరి నాటికి మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో నక్ష సర్వే పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ నక్ష సర్వే పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా

### దారా నియామకం పట్ల ఘన సన్మానం



దమ్మపేట జూన్ 8 (వుదయం ప్రతినిధి ):దమ్మపేట మండల కేంద్రానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త దమ్మపేట మండలం మాజీ వైస్ ఎంపీపీ, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ దారా మల్లికార్జునరావు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా దమ్మపేట మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షులు పసుమర్తి రామభద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దారా మల్లికార్జునరావును శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రామభద్రరావు మాట్లాడుతూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ఆర్యవైశ్య సమాజ అభ్యున్నతికి కృషి చేస్తున్న ధారా మల్లికార్జునరావుకు రాష్ట్ర స్థాయి బాధ్యతలు దక్కడం దమ్మపేట మండలానికి గర్వకారణమని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఆయన మరింత సమర్థవంతంగా సేవలందించి సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు అత్తులూరి పోసి వెంకట సీతారామరాజు, మండవల్లి సురేష్, చారు గుండ్ల ప్రదీప్, దొడ్డా వినోద్ కుమార్ తదితరులు పాల్గొని దారా మల్లికార్జునరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య.

### బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు..



పినపాక: జూన్ 08 (వుదయం ప్రతినిధి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం వ్యాప్తంగా జూన్ 15వ తారీకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభమయ్యే కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఉప్పాక ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ సుభద్ర తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉప్పాక గ్రామంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను వివరించి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ బోధన వంటి సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రవికుమార్, అనూష,నాగమణి, లావణ్య గ్రామ ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జయలక్ష్మి పురంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



సత్తుపల్లి జూన్ 8 (వుదయం ప్రతినిధి)ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా వేంసూర్ మండల పరిధిలోని జయలక్ష్మి పురం గ్రామపంచాయతీ నందు సర్పంచుల అధ్యక్షులు సర్పంచ్ గడపర్తి శ్రీనివాస్ రావు మరియు ఉప సర్పంచ్ జయరాజు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు . గ్రామ సభలో స్పెషల్ ఆఫీసర్ ఏవో రామ్మోహన్ వివిధ శాఖల అధికారులు గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శీలం శీను గారిని పరామర్శించిన తాటి

### బీఆర్ఎస్ కార్యకర్తకు అండగా తాటి,రూ.5,000 ఆర్థిక సాయం అందజేత



దమ్మపేట జూన్ 8 (వుదయం ప్రతినిధి): దమ్మపేట మోడల్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త శీలం శీను అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న లిబూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి ట్రైకార్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీ తాటి వెంకటేశ్వర్లు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా శీలం శీను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, తన వంతు సహాయంగా రూ.5,000 నగదు ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటానని తాటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శీలం శీను ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాకానాటి శ్రీను, పలువురు పాల్గొన్నారు..

# వాల్టా చట్టం పై అవగాహన కార్యక్రమం

### 99 రోజుల ప్రణాళిక లో భాగంగా అవగాహన కల్పించిన తల్లాడ రేంజర్ ఉమా

కల్లూరు (వుదయం ప్రతినిధి జూన్ 8) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా అటవీశాఖ కార్యక్రమాలపై జూన్ 1 నుండి 12వ తేదీ వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అందులో భాగంగా జూన్ 8న అటవీశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వోల్టా చట్టంపై సర్పంచులకు అవగాహన కల్పించినట్లు తల్లాడరేంజర్ ఉమా తెలిపారు. అడవుల రక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా వోల్టా చట్టం పనిచేస్తుందని తెలిపారు. నీరు, భూమి మరియు వృక్షాల సంరక్షణతో సమతుల్యత ఏర్పడి మానవాళి జీవితం ఆరోగ్యకరంగా ఉంటుందని అన్నారు. భవిష్యత్తు తరాలకు మనం అందించి



చిరుకానుకగా చెట్లను పెంచాలని అన్నారు. చెట్లను నాటడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని వన్యప్రాణులు, పశుపక్షాదులు జీవించడానికి అనుకూలంగా ఉంటుందని అన్నారు. అడవులను నరకడం వల్ల జీవనాధారం లేక కోతులు, జంతువులు జనసమూహం లోకి రావడంతో కొత్త కష్టాలను కొని తెచ్చుకున్నట్లు తెలిపారు. అడవులను వన్యప్రాణులను భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు డిఆర్ఓ రవికుమార్, గట్టుగూడెం డిఆర్ఓ సురేష్ కుమార్, సెక్షన్ ఆఫీసర్ కిషోర్,అటవీశాఖ సిబ్బంది, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామసభ



పినపాక:జూన్ 08 (వుదయం ప్రతినిధి) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతిప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం పినపాక మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించబడ్డాయి. మండలంలోని తోగ్గూడెం గ్రామపంచాయతీలో సర్పంచ్ పూనెం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన గ్రామసభకు ముఖ్యఅతిథిగా మండల ప్రత్యేక అధికారి ఎ .తాతారావు హాజరయ్యారు. ఈ సభకు హాజరైన ఎంపీఓ శ్రీనివాస్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కొరకు 99 రోజుల ప్రగతి ప్రణాళిక అమలు చేస్తుందన్నారు. ప్రజలందరి సహకారంతోనే ఇది సాధ్యపడుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే పథకాలు చేరేలా చూస్తామన్నారు. వచ్చేది వానకాలం కావున సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజలకు అండగా ఉండాలని కోరారు. ఈ గ్రామసభలో ప్రజలు గ్రామానికి సంబంధించిన పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శి ఎ .సంధ్యారాణి, ఉప సర్పంచ్ అచ్చా నవీన్, పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు డొంకెల సాంబశివరావు, చిట్టిమల్ల సతీష్ చారి , నల్లూరి లక్ష్మయ్య, కొంపెల్లి మల్లేష్ గౌడ్,గంగరబోయినరామకృష్ణ , వడ్డే వినోద్,పసల రాము,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి నివేదిక: అధికారులు ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట జూన్: 08 వుదయం ప్రతినిధి తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకే 'ప్రజా పాలన ప్రగతి నివేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. సూర్యాపేట మండలం రామన్నగూడెం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూప్రభుత్వం విద్యా, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఇందులో భాగంగానే 99 రోజుల పాటు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా పాలనలో భాగంగా అధికారులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి, వారి సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరిస్తారని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేరాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా లాభసాటి పంటలు ప్రస్తుత సీజన్‌లో మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు సాంప్రదాయ వరి సాగుకు ప్రత్యామ్నాయంగా లాభసాటిగా ఉండే ఇతర పంటలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. రానున్న వర్షాకాలంలో ఎల్నీనో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని గుర్తుచేశారు. వర్షాలు సకాలంలో పడకపోతే, వరి పంట చేతికొచ్చే సమయానికి ఆశించిన దిగుబడి రాక రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నష్టాలను నివారించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా.. విడతల వారీగా ఎలాంటి ప్రత్యామ్నాయ పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుందో వ్యవసాయ అధికారులు రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తారని కలెక్టర్ తెలిపారు. ఓటర్ జాబితాలో పేరు నమోదు కోసం తమ ఇళ్లకు వచ్చే బీఎల్ఓల దగ్గర ఎన్యుమరేషన్ ఫామ్ పూర్తి చేసి అందించాలని కోరారు. అలాగే, పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే వారికి నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం అందడం ఎంతో కీలకమని, ఆ దిశగా తల్లిదండ్రులు, అధికారులు కృషి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో రామన్నగూడెం గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచి, ఒక ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ నెల 25 లోపు బిల్లులు సమర్పించాలి గ్రామంలోని వార్డుల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ఈ నెల 25వ తేదీ లోపు సబ్మిట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## మహబూబ్‌నగర్-సికింద్రాబాద్-మేడ్చల్ సెక్షన్‌లో ఎలక్ట్రిక్ ట్రాక్షన్ సిస్టమ్ అప్‌గ్రేడేషన్‌కు ఆమోదం తెలిపిన భారతీయ రైల్వేలు

దక్షిణ మధ్య రైల్వేలోని మహబూబ్‌నగర్–సికింద్రాబాద్–మేడ్చల్ సెక్షన్‌లో రైలు కార్యకలాపాలను మెరుగుపరచడానికి ఒక కీలకమైన ప్రాజెక్టును భారత రైల్వే మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు కింద, ప్రస్తుతం ఉన్న 1ఞ25 కె వి ఎలక్ట్రిక్ ట్రాక్షన్ సిస్టమ్‌ను ఆధునిక 2ఞ25 కె వి ఎలక్ట్రిక్ ట్రాక్షన్ సిస్టమ్‌గా అభివృద్ధి చేయనున్నారు. సుమారు 141 రూట్ కిలోమీటర్ల మేర ఈ రైలు మార్గంలో ?285.01 కోట్ల వ్యయంతో ఈ పనిని చేపట్టనున్నారు.

భారత రైల్వేలు దేశవ్యాప్తంగా రద్దీగా ఉండే రైలు మార్గాలలో సామర్థ్యాన్ని పెంచడానికి చేస్తున్న నిరంతర ప్రయత్నాలలో ఈ ప్రాజెక్టు కూడా ఒక భాగం. 2ఞ25 కె వి వ్యవస్థను ప్రవేశపెట్టడం వల్ల రైలు కార్యకలాపాలకు మరింత స్థిరమైన, సమర్థవంతమైన నిరంతర విద్యుత్ సరఫరా లభిస్తుంది. దీనివల్ల రైలు సేవలు మరింత సులభతరం, సురక్షితం మరి నమ్మదగినవిగా మారతాయి. మహబూబ్‌నగర్–సికింద్రాబాద్–మేడ్చల్ సెక్షన్ దేశంలోని ముఖ్యమైన అత్యంత రద్దీ (హై–డెన్సిటీ నెట్‌వర్క్) గల మార్గాలలో ఒకటి. ఇది ధర్మవరం–ఢోన్–మహబూబ్‌నగర్–సికింద్రాబాద్–మేడ్చల్–ముద్ఖేడ్–ఇండోర్–అజ్మీర్ రైల్ కారిడార్‌లో భాగంగా ఉంది. ఈ మార్గంలో గణనీయమైన ప్రయాణీకుల మరియు సరుకు రవాణా జరుగుతుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత, ఈ మార్గంలో రైలు కార్యకలాపాలు మరింత మెరుగుపడతాయి. సరుకు రవాణా మరింత సమర్థవంతంగా మారి, దాని వేగం మరియు సామర్థ్యం రెండూ పెరుగుతాయి. ఈ ప్రాజెక్ట్ వలన ఈ ప్రాంతమంతటా వాణిజ్యం, పరిశ్రమలు మరియు ఆర్థిక కార్యకలాపాలకు కూడా మద్దతు కలుగుతుందని భావిస్తున్నారు. ఈ చొరవ భారతీయ రైల్వేల ఆధునిక, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న రైల్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలనే సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తుంది. అలాగే, మెరుగైన రైలు మౌలిక సదుపాయాలు మరియు కార్యాచరణ సామర్థ్యం ద్వారా ప్రయాణీకులకు, పరిశ్రమలకు ప్రయోజనం చేకూరుస్తుంది.

## డీఎంహెచ్‌ఓగా డాక్టర్ ఎస్. దుర్గా రామ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



?హనుమకొండ, జూన్ 08 (వుదయం ప్రతినిధి) : వైద్య ఆరోగ్యశాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా హనుమకొండ జిల్లా నూతన వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) గా డాక్టర్ ఎస్. దుర్గా రామ్‌కుమార్ నియమితులయ్యారు. గతంలో కూకట్‌పల్లి జోన్ డీఎంహెచ్‌ఓగా పనిచేసిన ఆయన, బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయన రిపోర్ట్ చేశారు. అలాగే అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీఆర్‌ఓ శ్రీనివాస్‌లను కూడా కలిశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ అల్లం అప్పయ్య ములుగు జనరల్ ఆస్పత్రి ఆర్‌ఎమ్‌ఓగా బదిలీ అయ్యారు. వీరితో పాటు హనుమకొండ జిల్లాకు డిప్యూటీ సివిల్ సర్జన్లుగా డాక్టర్ సిహెచ్. మురళి, డాక్టర్ పవిత్ర బదిలీపై వచ్చారు. ?నూతన డీఎంహెచ్‌ఓకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్ మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ రుబీనా అఫ్రోజ్, ఏఓ కోలా రాజేష్, జిల్లా మాస్ ఎడ్యుకేషన్ మీడియా అధికారి అశోక్ రెడ్డి, హెచ్‌ఈఈఓ చంద్రశేఖర్, డీపీఓ రుక్మద్దీన్, ప్రసన్న కుమార్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

### అడిషనల్ కలెక్టర్ జి. సంధ్యారాణి



రాయపర్తి జూన్ 08(వుదయం ప్రతినిధి):మండల పరిధిలోని కొత్తూరు గ్రామ పంచాయతీలో సర్పంచ్ కందికట్ల స్వప్న సంతోష్ అధ్యక్షతన సోమవారం ప్రత్యేక గ్రామ సభ సమావేశం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ గ్రామసభకు ముఖ్య అతిథిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ జి. సంధ్యారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ జి. సంధ్యారాణి మాట్లాడుతూ, గ్రామాల సమగ్ర పర్యావరణ పరిరక్షణకు, ప్రజల ఆరోగ్య రక్షణకు ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు ఎంతగానో తోడ్పడతాయని, వీటిపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలనిసూచించారు. తహసిల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జనాభా లెక్కల ప్రక్రియలో మరియు ఓటరు జాబితా సవరణ కార్యక్రమాలలో గ్రామీణులుచురుగ్గాపాల్గొని,అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నవోదయ్యేలా చూడాలని పిలుపునిచ్చారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కూచన ప్రకాశ్ మాట్లాడుతూ, పచ్చని పర్యావరణం కోసం ప్రజలు తమ సామాజిక బాధ్యతగా ఇళ్లలోనే తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ ట్రాక్టరుకు అందించాలని కోరారు. ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలను సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ ప్రతి ఒక్కరూ విధిగా పాటించి కొత్తూరుగ్రామాన్నిఆదర్శవంతమైన స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ కందికట్ల స్వప్న సంతోష్ మాట్లాడుతూ, ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో కొత్తూరు అభివృద్ధికి, స్వచ్ఛతకు పాలకమండలి నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ చిప్ప శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అస్మా, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, ఐకేపీ మహిళా సంఘాల ప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం: జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



మహబూబాబాద్ జిల్లా జూన్ 08 (వుదయం ప్రతినిధి) : మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమం ద్వారా ప్రజల నుండి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గారు వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుండి తమ సమస్యలను విన్నవించుకోవడానికి వచ్చే ప్రజల పట్ల అధికారులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా సత్వరమే పరిష్కార మార్గాలను చూపాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు అనిల్ కుమార్ మరియు (ఇంచార్జ్) పురుషోత్తం పర్యవేక్షణలో, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను వర్గీకరించి, వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ స్నేహ శబరీష్ స్వయంగా వినతులను స్వీకరించారు. వారి సమస్యలను ఓపికగా విని, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం (హొ170 ) దరఖాస్తులు వచ్చాయి. శాఖల వారీగా దరఖాస్తులు ఇలా ఉన్నాయి మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలోని బాత్‌రూమ్‌లకు తాళాలు వేసి ఉంచడం వల్ల, చికిత్స కోసం వచ్చే రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి పక్కనే ఉన్న సందులలో మూత్ర విసర్జన చేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారి, దుర్వాసనతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఆసుపత్రి మేనేజ్‌మెంట్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. హొయాసారపు శిరీష భర్త మురళి, గ్రామం: వెంకటాపురం, మండలం: కేసముద్రం, చెందిన తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, భర్త తనను వదిలేసి వెళ్ళిపోవడంతో ఎలాంటి జీవనాధారం లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలను పోషించుకోవడానికి తనకు 'ఒంటరి మహిళా పింఛన్' మంజూరు చేయాలని కలెక్టర్ గారిని వేడుకున్నారు. గడిశల వెంకన్న తండ్రి జల్సయ్య, తాళ్ళపూసపల్లి నుండి చెముల్లాపూర్ వరకు వెళ్లే ప్రధాన సాగునీటి కాలువ (నక్షా ప్రకారం ఉన్న రోడ్డు/కాలువ) పూడికకు గురైందని, దీనివల్ల రైతులకు సాగునీరు అందడం లేదని పేర్కొన్నారు. సర్వే నిర్వహించి, కాలువను పునరుద్ధరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. బి. మాధవి భర్త మాదంతి, గ్రామం: బంచరాయుతండా, మండలం: గూడూరు, తాము పెంకుటింట్లో నివసిస్తున్నామని, వర్షం వస్తే ఇల్లంతా నానుతూ కూలిపోయే స్థితికి చేరిందని తెలిపారు. గతంలో 1ర లిస్ట్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఇల్లు మంజూరు కాలేదని, ప్రస్తుత 2అ లిస్ట్‌లో అయినా తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఎస్.కె. ఖాసిం సాహెబ్ తండ్రి ఖాదర్ సాహెబ్, మహబూబాబాద్ మండలం ఈదులపూసపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్లు 102 మరియు 103 లలో గల భూమికి సంబంధించి కొంత కాలంగా సమస్య నెలకొని ఉందని, దీనిపై విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని కోరారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, పారదర్శకమైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశం అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగులు, ప్రతి ఒక్కరు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం పొందాలని సూచించారు, వచ్చేవారం, పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పాఠశాలలు వసతి గృహాలను తనిఖీ చేసి పిల్లలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు, జిల్లాలో రికార్డు స్థాయిలో మక్కజొన్నలు, వరి ధాన్యం ఉత్పత్తి అయినందున అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాటు చేసి తరలించడం జరిగిందని, అందుకోసం కృషిచేసిన బాధ్యతాయుతంగా పనిచేసే ప్రత్యేకంగా ప్రతి ఒక్కరిని అభినందించారు, కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, జడ్పీ సీఈవో (హౌసింగ్ పీడీ) అదనపు కలెక్టర్ ఇంచార్జ్ స్థానిక సంస్థల పురుషోత్తం, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు,హొ డిసిఓ వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయి అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## కలగానే నైన్ పాక - నేరేడుపల్లి బ్రిడ్జి.

### పట్టించుకోని పాలకులు.
### ఇబ్బందుల్లో ప్రజలు.
### ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ.



భూపాలపల్లి జూన్ 08 (వుదయం ప్రతినిధి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్ పాక - భూపాలపల్లి మండలం నేరేడు పల్లి మధ్యలో గల మోరంచ వాగు పై నిర్మిస్తున్న బ్రిడ్జి కలగానే మిగులుతుందని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ అన్నారు. ఈసందర్భంగా ఆయన అర్ధాంతరంగా నిలిచిపోయిన బ్రిడ్జి ని పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ 2022సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం సుమారు 6కోట్ల నిర్మాణ వ్యయంతో నిర్మించ తలపెట్టిన బ్రిడ్జి ఇప్పటికి పూర్తికాక పోవడం పట్ల పాలకుల, అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని, బ్రిడ్జి నిర్మాణం పూర్తి ఐతే జిల్లా కేంద్రానికి సులువుగా ప్రయాణం చేయచ్చు అనుకున్న ప్రజల ఆశలు అడియాశలు అయ్యాయని,ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి ఐతే పరిసర గ్రామ ప్రజలు భూపాలపల్లి జిల్లా కేంద్రానికి వెళ్లడం సులువు ఐతుందని, బ్రిడ్జి నిర్మాణం కాక పోవడం మూలంగా సుమారు 20 కిలోమీటర్లు ఎక్కువగా ప్రయాణం చేసి భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చేరుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా స్థానిక శాసనసభ్యులు, మరియు అధికారులు స్పందించి మళ్ళీ బ్రిడ్జి పనులు మొదలు పెట్టి పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే వార్డు సభ

### హనుమకొండ డిసిసి ఉపాధ్యక్షులు ఏనుకొంటి నాగరాజు



సుబేదారి, జూన్ 07 (వుదయం విలేఖరి): ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా వార్డులో వార్డు సభ నిర్వహించి, ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించి వాటి పరిష్కారం కోసం కృషి చేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని హనుమకొండ డిసిసి ఉపాధ్యక్షులు ఏనుకొంటి నాగరాజు తెలిపారు. సోమవారం 60వ డివిజన్ పరిధి టీచర్స్ కాలనీ ఫేస్ వన్ కమ్యూనిటీ హాల్ లో 99 రోజుల యాక్షన్ ప్లానింగ్ వార్డు సభ, వార్డు ఆఫీసర్ హరినాథ్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రజలకు దగ్గరగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని, అందులో భాగంగానే వార్డు సభ నిర్వహించి ప్రజల దగ్గరికి అవుతుందని, ప్రగతి ప్రణాళికలో భాగంగా అన్ని రంగాల్లో ఏ విధమైనటువంటి అభివృద్ధి జరిగిందని ప్రజలందరికీ తెలిసే విధంగా వార్డు సభ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు అభివృద్ధిని ముందు తీసుకుపోవడానికి ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను స్వీకరించి, వాటి పరిష్కారం కోసం అధికారులు నిరంతరం కృషిచేసి అభివృద్ధిని మరింత ముందుకు తీసుకుపోతున్నారని తెలిపారు.

ప్రజలు వివిధ సమస్యల పైన, ఇందిరమ్మ ఇండ్లు, డబల్ బెడ్ రూమ్ లకు, పెన్షన్స్, ఉచిత కరెంటు వంటి కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 60వ డివిజన్ డివిజన్ అధ్యక్షులు ఏనుకొంటి పున్నం చందర్, కాంగ్రెస్ శ్రేణులు మెరుగు శివ, జనగాం శ్రీనివాస్, బుస్సా నవీన్ కుమార్, మట్టపల్లి కమల్, ఎండి సాజిద్, ఎం.డి అక్మల్, శేఖర్, యుగంధర్, స్వప్న, మీనా, అధికారులు, బిల్ కలెక్టర్ అజయ్ కుమార్, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పై అవగాహన



భూపాలపల్లి జూన్ 08(వుదయం విలేకరి) :టీజీపీసీబీ జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో ఘనంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు మున్సిపల్ సిబ్బంది, స్వచ్ఛ భారత్ వర్కర్లకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా టీజీపీసీబీ నోడల్ అధికారి కో–ఆర్డినేటర్ వెంకటేష్ అవగాహన కల్పించరు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి భూపాలపల్లి జిల్లా నోడల్ కార్యాలయంలో జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయంలో విస్తృత పర్యావరణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, మున్సిపల్ కమిషనర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అందించిన ప్రత్యేక సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టారు. ఈ సదస్సులో మున్సిపల్ మరియు స్వచ్ఛ భారత్ మిషన్‌కు చెందిన సుమారు 60 మంది కార్మికులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా టీజీపీసీబీ నోడల్ అధికారి ఎ. శ్రీకాంత్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఘన వ్యర్థాల నిర్వహణ నియమావళి, తడి–పొడి చెత్త వేరు చేయడం మరియు పర్యావరణ పరిరక్షణ చట్టాలపై సిబ్బందికి పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. అదేవిధంగా, జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ కో–ఆర్డినేటర్ వెంకటేష్ కూడా క్షేత్రస్థాయిలో చెత్త రహిత గ్రామాలు మరియు పట్టణాల రూపకల్పన, పరిశుభ్రత పాటించడంలో కార్మికుల బాధ్యతలను క్షుణ్ణంగా వివరించారు. మున్సిపల్ పరిధిని పర్యావరణహితంగా మార్చడంలో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## లోడింగ్ లో జాప్యం చేస్తున్న క్వారీ నిర్వాహకులు

### ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న డ్రైవర్లు





మహాదేవపూర్ జూన్ 08(వుదయం ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల పరిధిలోని ఎల్కేశ్వర్ క్వారీ తోపాటు పలు ఇసుక క్వారీలలో గత కొన్ని రోజులుగా లోడింగ్ లో జరుగుతున్న జాప్యం వల్ల ఎండ వేడి తీవ్రత తట్టుకోలేక లారీ యజమానులు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లారీ సంఘం మండల అధ్యక్షుడు ఓడేటి భరత్ రెడ్డి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎండాకాలం తీవ్రంగా ఉండటంతో వందలాది లారీలు క్వారీల వద్ద రోజుల తరబడి నిలిచిపోతున్నాయని దీంతో డ్రైవర్లు తాగునీరు, భోజనం, ఇతర కనీస సౌకర్యాలు లేక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లోడింగ్ జాప్యంతో ప్రతీరోజు వందలాది లారీలు నిలిచి లారీ యజమానులు,డ్రైవర్లు అనేక ఇబ్బందులు పడాలి వస్తోందని, ఏ రోజుకారోజు తరలించాల్సిన ఇసుక తరలింపులు జరపక పోవడంతో ప్రభుత్వ ఖజానాకు జమ కావాల్సిన ఆదాయంలో జాప్యం జరుగుతోందని తెలిపారు. అయితే లోడింగ్ ఆలస్యం కావడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన రోజువారీ ఆదాయం కూడా నిలిచిపోతున్న పరిస్థితి ఏర్పడుతోందని, ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న క్రమంలో అవసరమైన నిధులు సరైన సమయానికి అందకుండా పోతున్నాయని, క్వారీలలో ఏర్పడుతున్న నిర్లక్ష్య పరిస్థితుల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా, పరోక్షంగా ప్రజలకు చేరాల్సిన అభివృద్ధి ఫలాలు కూడా ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు క్వారీల నిర్వహణలో సరైన ప్రణాళిక, సమన్వయం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని,ప్రభుత్వ పెద్దలు, జిల్లా అధికారులు సంబంధిత శాఖలు స్పందించి వెంటనే జోక్యం చేసుకుని లోడింగ్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని తెలిపారు. క్వారీల వద్ద నిలిచిపోయిన వందలాది లారీలకు వెంటనే లోడింగ్ కల్పించి, డ్రైవర్లకు కనీస సౌకర్యాలు అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతి రూపాయి ప్రభుత్వ ఖజానాకే చేరి ప్రజల సంక్షేమం కోసం వినియోగించబడాలనే ఉద్దేశంతోనే ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నాము. కాబట్టి ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని మహాదేవపూర్ లారీ అసోసియేషన్ తరపున విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.

## మన ఇసుక వాహనం పథకం ద్వారా ఇసుకను కేటాయించాలి, ఇసుక అక్రమ రవాణా నివారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు,

### లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులు కార్యకలాపాలు నిర్వహించాలి,
### జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.
### జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్,



మహబూబాబాద్ జిల్లా జూన్ 08 (వుదయం ప్రతినిధి) : కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ డాక్టర్ శబరిష్, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్, జిల్లాలోని అక్రమ ఇసుక రవాణా, మన ఇసుక వాహనం పథకం అమలు, లింగ నిర్ధారణ పరీక్షలు, మాతా శిశు సంరక్షణ,క్లినికల్ హాస్పిటల్ అనుమతులు, తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం సూచించిన ప్రకారం ఇసుకను అందించాలని, ఇసుక రీచ్ లు కలిగిన ప్రదేశాలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు, అందుకోసం జిల్లాస్థాయి ఇసుక టాస్క్ ఫోర్స్ కమిటీని నియమించడం జరిగిందని అందులో ఆర్డీవో, ఎడి మైనింగ్, పోలీస్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి, రవాణా శాఖ అధికారి, తదితరులు ఉంటారని ఈ యొక్క కమిటీ పూర్తిగా మన ఇసుక వాహనం పథకం అమలు, ఇసుకను అక్రమంగా తరలించకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు, కేవలం ఉదయం పూట మాత్రమే ఇసుక రవాణా చేసే విధంగా ఏర్పాటు చేయాలని ప్రత్యేక పోస్టులు నియమించాలని పోలీస్ రెవెన్యూ అన్ని విభాగాల ను ఆదేశించారు, జిల్లాలో అక్రమ స్కానింగ్లు, అబార్షన్లు జరగకుండా గట్టి నిఘాను ఏర్పాటు చేయాలని, మాతా, శిశు మరణాలను జరగకుండా చూడాలని, హాస్పటల్కు తనిఖీ వెళ్ళినప్పుడు తగిన నిబంధనలు పాటిస్తున్నారా లేదా సంబంధిత సీనియర్ వైద్యులు ఉన్నారా లేదా అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు, లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు జరిగే ప్రాంతాలను గుర్తించి స్థానిక వైద్యుల చేత సమాచారం తెలుసుకొని, మెడికల్ షాపులలో మందుల అమ్మకాలను పరిశీలించాలని తెలిపారు, క్లినికల్ హాస్పిటల్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తులు పకడ్బందీగా అన్ని విభాగాల వారు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఎలాంటి నిబంధనలు పాటించకుండా దరఖాస్తు చేస్తే తిరస్కరించాలని ఆదేశించారు, హాస్పటల్లో పనిచేసే వైద్యుల వివరాలను తెలుసుకోవాలని, సూపర్ స్పెషాలిటీ, హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్, తదితర హాస్పిటల్స్ లో మౌలిక వసతులు ఫైర్, త్రాగునీరు ,పార్కింగ్, సిబ్బంది వివరాలు చెక్లిస్ట్ ప్రకారం తనిఖీ చేయాలని ఆదేశించారు, లింగ నిర్ధారణ, అక్రమ అబార్షన్లు, బాల్యవివాహాలు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రజల్లో విస్తృతంగా ప్రచారం అవగాహన కల్పించాలని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అలా ప్రచారం నిర్వహిస్తే చాలా వరకు ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉంటాయని తెలిపారు, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్లి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రైవేటు హాస్పటల్లో ప్రత్యేక నీఘా పెట్టాలని, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో ప్రాథమిక వైద్యుల ద్వారా వివరాలు సేకరించాలని, తద్వారా లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టవచ్చని తెలిపారు, ప్రత్యేక విభాగం ద్వారా అక్రమ ఇసుక రవాణా, మందుల షాపులపై నిరంతర పర్యవేక్షణ, ప్రతి ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు, ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె అనిల్ కుమార్, తొర్రూరు ఆర్డీవో గణేష్, పోలీస్, తహసిల్దార్లు ఎడి మైనింగ్ వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, ఐఎంఐ, కోర్టు, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## 29 వ వార్డు కౌన్సిలర్ వేముల సంధ్య సాంబయ్య గౌడ్

నర్సంపేట జూన్ 08 (వుదయం ప్రతినిధి) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నర్సంపేట మున్సిపాలిటీ 29వ డివిజన్లో గ్రామసభ లో వార్డు కౌన్సిలర్ వేముల సంధ్యా సాంబయ్య గౌడ్, కమిషనర్ కాటం భాస్కర్, పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని వర్షాకాలం వస్తున్న సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండి చెత్తాచెదారం విచ్చలవిడిగా పడేయకుండా మున్సిపాలిటీ చెత్త సేకరణ వాహనంలో మాత్రమే వేయాలని ఖాళీ ప్రదేశాలు ఉన్నచోట యజమానులు ఫినిషింగ్ చేసుకొని పిచ్చిచెట్లు పెరగకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం ఇందిరా ఇండ్లు, పెన్షన్లు, రేషన్ కార్డుల అప్లికేషన్లను స్వీకరించినారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ శ్రీకాంత్, సానిటేషన్ ఇన్స్పెక్టర్, ఆర్ పి లు దేవమ్మ, మోడం అనిత ఏఎన్ఎం గద్ద సునీత, ఆశ వర్కర్ సరిత, పంప్ ఆపరేటర్ నాయనీ సతీష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి నాంపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జిజుల కార్తీక్, వార్డు డెవలప్మెంట్ కమిటీ సభ్యులు తోకల శ్రీనివాస్, మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు వార్తలను ప్రభుత్వం ఖండించాలి

## ఉప సర్పంచ్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బోట్ల కార్తీక్





రాయపర్తి, జూన్ 8 (వుదయం ప్రతినిధి): ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌ను ప్రభుత్వం రద్దు చేయబోతున్నట్లు కొన్ని వార్తాపత్రికల్లో వస్తున్న కథనాలను ప్రభుత్వం వెంటనే ఖండించాలని ఉప సర్పంచ్‌ల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో ఉప సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చీకటి కరుణాకర్, జిల్లా అధ్యక్షుడు దండా నరేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి రవి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చీకటి కరుణాకర్ మాట్లాడుతూ, ఉప సర్పంచ్‌ల హక్కులు, అధికారాల పరిరక్షణ కోసం అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఐక్య పోరాటాలతోనే హక్కులను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు దండా నరేష్ మాట్లాడుతూ, చెక్ పవర్ అంశంపై ప్రభుత్వం స్పందించకపోతే ఉప సర్పంచ్‌లు పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం రాయపర్తి మండల ఉప సర్పంచ్‌ల ఫోరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా కంటారు బిక్షపతి, అధ్యక్షుడిగా దురిశెట్టి రమేష్, ప్రధాన కార్యదర్శిగా మునావత్ శంకర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుగులోతు రవి ఎన్నికయ్యారు.

ఉపాధ్యక్షులుగా చిర్ర నాగరాజు, చిప్ప శ్రీనివాస్, కుంభం లలిత, రత్నాకర్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా భూక్యా లక్ష్మణ్ నాయక్, భూక్య శ్రీనివాస్, భూక్య నవీన్, అధికార ప్రతినిధిగా మచ్చ రమేష్, కోశాధికారిగా కలిమికుండా బొంద్యాలు ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# పేరుకే పైలెట్ గ్రామం సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



మహాదేవపూర్ జూన్ 08(వుదయం ప్రతినిధి): గ్రామ సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని బి ఆర్ ఎస్ పార్టీ నాయకుడు రాళ్ళబండి రవీందర్ ఆరోపించారు సోమవారం పాత్రికేయులతో మాట్లాడుతూ ఎల్కేశ్వరం గ్రామ పంచాయతీ లో నిర్వహించే గ్రామ సభలు పేరుకే నిర్వహిస్తూ ఫోటోలకు ఫోజులిచ్చి పోతున్నారని ఆరోపించారు ఎల్కేశ్వరం గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక 99 రోజుల గ్రామ సభలో గ్రామానికి చెందిన బోడ పోసక్క అనే మహిళ తన ఇంటి ముందు ఒక చెట్టు శిథిలావస్థలో ఉండి కొమ్మలు ఎండిపోయి చిన్న గాలి వాన వస్తె అది విరిగి పడే ప్రమాదం ఉందని దానిని తొలగించాలని విజ్ఞప్తి చేసినా అధికారులు, అధికారపార్టీ ప్రజా ప్రతినిధులు చూసి చూడనట్టు వ్యవహరించడంపై ప్రజా ప్రభుత్వంలో సమస్యలు పరిష్కారం కావా అని ప్రశ్నించారు పైలట్ గ్రామంగా ప్రకటించిన అధికారులు గ్రామంలో ఏ సమస్య అయినా వెంబడే తీరిపోతుంది అని ఓట్ల కోసం ఇంటి ముందుకు వచ్చిన ప్రజాప్రతినిధులు సమస్య చెప్పగానే మొహం చాటేస్తున్నారని అన్నారు. సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమౌతున్న విషయం గమనించిన ఎల్కేశ్వరం గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు రాళ్లబండి రవీందర్ ఆధ్వర్యంలో చెట్టుని తొలగించి సమస్యని పరిష్కరించామణి అన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే మా వంతు సహాయంగా ఉంటామని అన్నారు. అధికార పార్టీ కేవలం ఓట్ల కోసమే ఉందని సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదనతో ఆరోపించారు చెట్టును తొలగించి సమస్య పరిష్కరించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

# ఘనంగా సమ్మర్ క్యాంప్, ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్షిప్

## – ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుంది





హనుమకొండ, జూన్ 08 (వుదయం ప్రతినిధి) : హనుమకొండ కొత్తూరు జెండా సమీపంలోని ఇంటిగ్రల్ ఫౌండేషన్ స్కూల్లో 'బిఎంఆర్ కరాటే డు అండ్ కిక్ బాక్సింగ్' ఆధ్వర్యంలో 45 రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు, ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్షిప్-2026 పోటీలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ నాన్-గెజిటెడ్ వెటర్నరీ ఫోరం ప్రెసిడెంట్ బింగి సురేష్, వరంగల్ టీఎన్జీఓ జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్ విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. ముఖ్యంగా అమ్మాయిలు ఆత్మరక్షణ కోసం కరాటే కటాస్, సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్, కిక్ బాక్సింగ్ పంచెస్ మరియు జంప్స్ నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 45 రోజుల వేసవి శిక్షణా శిబిరంలో దాదాపు 100 మంది విద్యార్థిని విద్యార్థులు శిక్షణ పొందారని, టోర్నమెంట్‌లో వారు చూపిన ప్రతిభకు గాను బంగారు, వెండి పతకాలను గెలుచుకున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటిగ్రల్ ఫౌండేషన్ స్కూల్ ప్రిన్సిపాల్ సుమయ్య నాజ్మీన్, వైస్ ప్రిన్సిపాల్ రషీదా ఫాతిమా, బిఎంఆర్ కరాటే డు మార్షల్ ఆర్ట్స్ అకాడమీ తెలంగాణ ఫౌండర్ డైరెక్టర్ బండారి సంతోష్, జనరల్ సెక్రెటరీ వెంకటేష్, ట్రెజరర్ కుమార్ పాల్గొన్నారు. అలాగే విద్యార్థులను తీర్చిదిద్దిన కోచ్‌లు బండారి నరేష్, పి. దినేష్, ఏ. గణేష్, సిహెచ్. కర్ణాకర్, కే. వెంకటేష్, రణధీర్, శశికరణ్, వైష్ణవి, ఎండి. ఆసియా, సిహెచ్. శివత్మిక, సాన్వి మోహన్, రామ్ చరణ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

## పదవ తరగతి 2005-2006 సంవత్సరం విద్యార్థులు.



ఖానాపురం, జూన్ 8 (వుదయం ప్రతినిధి): మండల కేంద్రంలోని నేతాజీ ఎయిడెడ్ సెకండరీ స్కూల్ ని 2005-2006 సంవత్సరం పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంను అయినవోలు మండలంలోని మ్యాంగో రిసార్ట్‌లో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనంను 20 సంవత్సరాల అనంతరం నిర్వహించుకున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. పూర్వ విద్యార్థులు గత పాత పరిచయాలను నెమరు వేసుకుంటూ ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మహేష్, సతీష్, శ్రీను, వంశీ, అరుణ్, గంగాధర్, అజారుద్దీన్, అక్బర్, ప్రభాకర్, నాగరాజు, రాజశేఖర్, స్రవంతి, అశ్విని, రోజా, ఉమా, సుమలత, రమాదేవి, జ్యోతి, కృష్ణవేణి, సంధ్య, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

## ఎంసిపిఐ (యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్.



వరంగల్ జిల్లా జూన్ 08 (వుదయం ప్రతినిధి) : వరంగల్‌లో ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో విఫలమయ్యాయని పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ విమర్శించారు. రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కు చట్టబద్ధ హోదా కల్పించాలని, కార్పొరేట్ దోపిడిని అరికట్టాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎరువుల ధరల పెంపును ఉపసంహరించుకోవాలని, నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరారు. మహిళలు, చిన్నారులపై దాడులను అరికట్టి దోషులను కఠినంగా శిక్షించాలని, ఉపాధి హామీ పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

### రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఇవి శ్రీనివాస్ రావుకిరణ్మయి



హనుమకొండ, జూన్ 08 (వుదయం ప్రతినిధి) : నూతనంగా రాజ్యసభ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన వేం నరేందర్ రెడ్డిని సోమవారం రోజున హైదరాబాద్‌లోని వారి నివాసంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు, ఐ అండ్ పీఆర్ డిపార్ట్మెంట్ కి చెందిన పీఆర్వో ఎం. కిరణ్మయి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ?ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డికి వారు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. రాజ్యసభ సభ్యులుగా అత్యున్నత బాధ్యతలు స్వీకరించినందుకు గాను వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ భేటీలో పలు అంశాలపై వారు సౌజన్యపూర్వకంగా చర్చించారు.

# కాళేశ్వరం అటవీ ప్రాంతంలో గుప్తనిధుల అన్వేషణ

## ఇద్దరు వ్యక్తుల అరెస్ట్



భూపాలపల్లి జూన్ 08(వుదయం విలేకరి): కాళేశ్వరం అటవీ ప్రాంతంలో గుప్తనిధుల అన్వేషణలో ఇద్దరు వ్యక్తుల అరెస్ట్ చేసినట్లు సీసీఎస్ సీఐ రమేష్ తెలిపారు సోమవారం అయన మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు సిసిఎస్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో కాళేశ్వరం అటవీ ప్రాంతంలో గుప్తనిధుల కోసం అన్వేషణ జరుపుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు విచారణలో భాగంగా గత ఆరు నెలలుగా కాళేశ్వరం పరిసర ప్రాంతాల్లో గుప్తనిధుల కోసం అన్వేషిస్తున్నట్లు వారు వెల్లడించారు అని వారి వద్ద నుంచి గుప్తనిధుల అన్వేషణకు ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నాట్లు తెలిపారు ఇంజారపు వెంకటరమణ ప్రసాద్, టీచర్స్ కాలనీ, ఆదిలాబాద్ వలబోజు శ్రీనివాస్, సుధా నగర్, హనుమకొండ ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు సీసీఎస్ సీఐ రమేష్ తెలిపారు. గుప్తనిధుల పేరుతో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# వార్డు సభల ద్వారానే పట్టణ సమగ్ర అభివృద్ధి సాధ్యం

## మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్





నర్సంపేట జూన్ 8 (వుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నర్సంపేట పట్టణంలోని 8,17,19, 20 వార్డులలో ఏర్పాటు చేసిన వార్డు సభలకు ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్ మరియు కమిషనర్ కాటం భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలకు ఆనాడు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకొని వారు మరోసారి దరఖాస్తు చేసుకొనుటకై వార్డు సభల ద్వారా అవకాశం కల్పిస్తున్నామని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు పారిశుద్ధంపట్ల శ్రద్ధ వహించాలని పట్టణ ప్రజలు తమకు మున్సిపాలిటీ నుండి అందజేసిన డబ్బాలలో తడి పొడి చెత్త ఇంటి వద్ద వేరు చేసుకుని మున్సిపల్ వాహనాలకు అందజేయాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో కూడా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. నర్సంపేట పట్టణంలోని రోడ్లు, డ్రైనేజీ సమస్యలన్నీ పూర్తి చేసుకుంటూ వస్తున్నామనీ మిగిలి ఉన్న పనులను కూడా పూర్తి చేస్తామని పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలని కోరారు. వార్డు సభల ద్వారా దరఖాస్తులు స్వీకరించి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్స్ శ్రీరామోజు రోజా రాణి, ఎండి అయూబ్ ఖాన్, ఎలకంటి విజయ్ కుమార్, దొంగల రజిత, అంగన్వాడీ టీచర్స్ నల్లా భారతి, ఎండి గౌసియా, అర్పిలు ఉమ, రజిత, వార్డ్ ఆఫీసర్స్ సిద్ధార్థ్, తరుణ్, మున్సిపల్ సిబ్బంది రమేష్, నవీన్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఈజీఎస్ పనుల అవకతవకలపై ప్రజావాణిలో సర్పంచ్ పై ఫిర్యాదు

నర్సంపేట జూన్ 08 (వుదయం ప్రతినిధి) : గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలను స్థానిక సర్పంచ్ తన సొంత కాంట్రాక్టర్ పనులకు వాడుకుంటూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని దుగ్గొండి మండలం గుడిమహేశ్వరం గ్రామస్తుడు బట్టు క్రాంతి కుమార్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం నర్సంపేట ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అందుకు సంబంధించిన సాక్షాలతో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ గుడి మహేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వర్తిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో పాల్గొన్న కూలీలు ఆ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న చెరువులో పనులు చేస్తున్న క్రమంలో ఫోటో గుర్తింపు కార్యక్రమం ముగియగానే స్థానిక సర్పంచ్ కూరతోట స్వప్న భర్త కూరతోట సురేష్, మల్టీ పర్పస్ వర్కర్ బిడుదుల రమేష్ లు కాంట్రాక్టు పని షెడ్డుకు మొరంకుప్పలు నేర్పడం,ఇతర సొంత పనులకు వాడుకుంటూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. దుగ్గొండి ఈజీఎస్ అధికారులకు, ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని అన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరినట్లు క్రాంతి కుమార్ తెలిపారు.

# కాకతీయ వర్సిటీ పీజీ పరీక్షలు ప్రారంభం!





హనుమకొండ టౌన్, జూన్ 08 (వుదయం ప్రతినిధి) : కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు అనుబంధ కళాశాలలలో ఎం.ఏ., ఎం.కామ్., ఎం.ఎస్‌సి. నాలుగవ సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరుగుతున్న పరీక్షల నిర్వహణను ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి పరిశీలించారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. విద్యార్థులకు నిరంతర విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు పరీక్ష సమయానికి అర్ధగంట ముందుగా కళాశాలకు చేరుకోవాలని సూచించారు. ఈ పరీక్షలు ఈనెల 19వ తేదీ వరకు నిర్వహించబడతాయని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి ఒంటిగంట వరకు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రెహమాన్, పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# భగవాన్ దాస్ ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నాం

## -ఎంపీ డాక్టర్ కడియం కావ్య



హనుమకొండ టౌన్, జూన్ 08 (వుదయం ప్రతినిధి):ప్రముఖ కార్మిక నాయకుడు, సీనియర్ కమ్యూనిస్టు యోధుడు బీఆర్ భగవాన్ దాస్ 96వ జయంతి వేడుకలు సోమవారం రోజున హనుమకొండ అశోక జంక్షన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై, భగవాన్ దాస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. సీపీఐ పార్టీ ద్వారా రాష్ట్రానికి విశిష్ట గుర్తింపు తెచ్చిన మహానేత భగవాన్ దాస్ అని కొనియాడారు. కార్మికులు, గుడిసెవాసులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ సాధన, సాగునీరు, ఉపాధి కల్పన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో ఈ ప్రాంత యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ఆయన ఆశయాలకు అనుగుణంగానే తాము ప్రజాసేవలో ముందుకు సాగుతున్నామని తెలిపారు. దేశ రాజ్యాంగం, సెక్యులర్ స్ఫూర్తిని కాపాడేందుకు కాంగ్రెస్, సీపీఐ పార్టీలు సమన్వయంతో పనిచేస్తాయని స్పష్టం చేశారు.

?ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, భగవాన్ దాస్ కుమారులు డాక్టర్ బి. రాజ్ సిద్ధార్థ, బీఆర్ లెనిన్, బీఆర్ఎస్ నాయకులు మేడిపల్లి శోభన్ బాబు, ఆవోపా జిల్లా అధ్యక్షుడు డి. ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా నాయకులు తోట సుధాకర్, కేకే, పి. అశోక్, గోకారపు శ్యామ్, బొడిగె శ్రీను తదితరులు పాల్గొన్నారు.